క్లుప్తంగా

అబ్బురపరచిన నాము చేను పంట



పాలకొల్లు మండలం దగ్గులూరులో నాము పంట మెషీన్‌తో కోస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: నవ్విన నాము చేనే పండదా అనేది నానుడి. నిజంగానే నాము చేను పండింది. పాలకొల్లు మండలం దగ్గులూరులో నాగాబత్తుల దాసు అనే రైతు రెండు నెలల క్రితమే పంట చేను కోశారు. అయితే కోసిన వరి మోడులు చిగురించాయి. నాము పెరిగింది. దీంతో రైతు అలాగే వదిలేశారు. నాము చేను పాలు పోసుకుని గింజలు తయారయ్యాయి. దీంతో రైతు వాటిని మెషీన్‌తో కోత కోయించి ఒబ్బిడి చేశారు. ఎకరం వరి చేలో సుమారు 10 సారలు దిగుబడికి వచ్చింది.

పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



పొన్నపల్లిలో రోడ్డుపై చెత్తకుప్పలు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులు పర్యవేక్షించి, ప్రతిరోజూ డ్రెయినేజీలను బాగు చేయాలని ఆదేశించారు. దోమలు పెరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుడదని సూచించారు. మున్సిపల్ సిబ్బందికి ప్రతిరోజూ చెత్తను అందించాలని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ అధికారులు ఉన్నారు.

ప్రేమతత్వమే క్రీస్తుతత్వం



కొంతేరులో ఐక్య క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

యలమంచిలి: ప్రేమ తత్వమే క్రీస్తుతత్వమని బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.ఉపేంద్ర అన్నారు. కొంతేరు బేతేలు ప్రార్థన మందిరంలో శనివారం యలమంచిలి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ క్రిస్మస్ లోకమంతటి పండుగన్నారు. క్రీస్తు రాకను ప్రపంచమంతా చాటాలని కోరారు. యలమంచిలి మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ బి దేవదానం, రెవరెండ్ గంధం చినబాబు, బ్రదర్ టి.నరిసింహరావు, పాస్టర్ ఎం.బాబు పీటర్సన్, బ్రదర్ వీకే దాస్, బ్రదర్ టి.రాజకుమార్, పాస్టర్ సీహెచ్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



గ్రంథాలయానికి అందించిన పుస్తకాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ దుర్గా కిశోర్

పాలకొల్లు సెంట్రల్: గ్రంథాలయాలు అనేవి విజ్ఞాన భాండాగారాలని వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత విజ్ఞానం పెరుగుతుందని తహసీల్దార్ వై.దుర్గా కిశోర్ అన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను తహసీల్దార్ అందజేశారు. ఈ సందర్భంగా దుర్గా కిశోర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ విద్యే పెద్ద ఆస్తి అని ఎంత చదువుకుంటే అంత పదునైన జ్ఞానాన్ని అందించేది విద్యేనని అన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే గ్రూప్-2, డీఎస్సీ, ఎన్ఈఈటీ అలాగే జనరల్ నాలెడ్జ్, చరిత్ర, జాగ్రఫీ వంటి పుస్తకాలను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో పుస్తకాలను అందించామన్నారు. కార్యక్రమంలో మాడభూషి కృష్ణప్రసాద్, ఎంవీవీ సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, ఎ.అన్నపూర్ణేశ్వరరావు, జి.సీతారామ్, కె.గోపాలస్వామి, గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

యమునాపల్లిలో ఎక్సైజ్ దాడులు

భీమవరం: మండలం యమునాపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గంటా శ్రీనును అరెస్టు చేసినట్లు సీఐ లరామరాజు చెప్పారు. అతని వద్దనుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి సందడి



పెనుగొండ: నడిపూడిలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

పెనుగొండ: ఓం స్కంధాయ నమః అంటూ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పెనుగొండ, ఆచంట మండలాల్లోని పెనుగొండ, వడలి, సిద్ధాంతం, నడిపూడి, దేవ, ఆచంట మండలంలో కొడమంచిలి ఆలయాల్లో తెల్లవారు జామునుంచి భక్తులు భారులు తీరారు. నడిపూడిలో శ్రీ వల్లి దేవ సేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద షష్ఠి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, భస్మాభిషేకం, నెయ్యాభిషేకం వేడుకగా నిర్వహించారు అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం సహజ సిద్ధంగా ఏర్పడిన పుట్టను స్వామివారి విగ్రహం వెనక ఏర్పాటు చేసి అద్దంలో నుంచి తిలకిస్తూ భక్తులు దర్శనం చేసుకున్నారు. అనంతరం నాలుగు గంటలకు స్వామి వారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్ర కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనుగొండ ఎస్సై కె. గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిద్ధాంతం వశిష్ఠ గోదావరి తీరంలో కేదారేశ్వర స్వామి వారి ఆలయం ఉపాలయంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలనూ, వడలి సుబ్బారాయుడు పుంతలోని సుబ్బారాయుడు ఆలయంలోనూ, దేవలోనూ షష్ఠి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే ఆచంట మండలం కొడమంచిలిలో షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు కోట రోడ్డులోని నాగదేవత ఆలయం, ఉచ్చింతకాలువ, రామన్నపాలెం పంచాయతీ ఆంబోతుతిప్ప, ముత్యాలపల్లి, వారతిప్ప కాళీపట్నం, కోమటితిప్ప, కేపీ పాలెం, పేరుపాలెం, నీటితిప్పలోని ఆలయాల వద్ద స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. కోమటితిప్పలో ఆలయ చైర్మన్ పొత్తూరి శ్రీనివాసరాజు, కొల్లాటి రాంప్రసాద్, అల్లూరి రంగరాజు,సత్తినేని మోహనరావు,జవ్వాది సత్యనారాయణ,ముదునూరి వాసురాజులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలకొల్లు మండలంలో..

పాలకొల్లు అర్బన్: మండలంలో కొలువై ఉన్న శ్రీ వల్లీ దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పెదమామిడిపల్లి, లంకలకోడేరు గ్రామాల్లో స్వామివార్ల కల్యాణం సందర్భంగా షష్ఠి తీర్థం నిర్వహించారు. అలాగే పెదమామిడిపల్లిలో కల్యాణ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. లంకలకోడేరులో ఆలయ అర్చకస్వామి సన్నిధిరాజు సూర్యనారాయణమూర్తి (చంటి), పెదమామిడిపల్లిలో చేబ్రోలు బాలకృష్ణ గాంధీ, చేబ్రోలు శ్రీనివాసరామమూర్తి, చేబ్రోలు కృష్ణమోహన్, ఈఓ యాళ్ల సూర్యనారాయణ భక్తులకు సేవలందించారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం షష్ఠి ఉత్సవాలు పురస్కరించుకుని పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం, సుబ్బారాయుడి గుడి సెంటర్ శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, శ్రీ శృంగేరి శంకర మఠం, శ్రీ శంభేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, బ్రాడీపేట శ్రీ లక్ష్మీ గణపతి, బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి వేకువజాము నుండి భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం పూలు పడగలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ఉన్న నాగేంద్రుని పుట్టలకు భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సుబ్బారాయుడు గుడి నుండి పట్టణ పురవీధుల్లో స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గుంపర్రు, లక్ష్మీపాలెం, బాడవ, దొడ్డిపట్ల, యలమంచిలి, మేడపాడు, అడవిపాలెం గ్రామాలలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజామున 3 గంటలు నుండి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకున్నారు. గుంపర్రులో సంతానం లేని మహిళలు నాగులు చీర కట్టుకుని స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయంలో ఉన్న పుట్ట వద్ద కూడా మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికి మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. గుంపర్రులో శ్రీవల్లీదేవసేనా సహిత సుబ్రమణ్యేశ్వర స్వామిని నెమలి వాహనంపై కూర్చుండబెట్టి మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రుస్తుంబాద, లిఖితపూడి, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్ల గ్రామాల్లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జామునే భక్తులు చేరుకుని స్వామివారికి పువ్వులు, పడగ సమర్పించి పాలాభిషేకాలు జరిపారు. లక్ష్మణేశ్వరంలోని శ్రీదుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. వ్యాపారవేత్త చాగంటి మురళీకృష్ణ (చిన్న) ఆర్థిక సహకారంతో వేలాది మంది భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాజేష్ గురుస్వామి అయ్యప్ప గానామృతం, సింగర్ మధుప్రియ పాటలు అలరించాయి.



మొగల్తూరు: కోట రోడ్డు వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



పాలకొల్లు సెంట్రల్: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ



యలమంచిలి: గుంపర్రులో నెమలి వాహనంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆకర్షిస్తున్న స్టార్, క్రిస్మస్ ట్రీ



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు - భీమవరం జాతీయ రహదారిలో బల్లిపాడు వద్ద ఏర్పాటుచేసిన స్టార్, క్రిస్మస్ ట్రీ ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్ దీపాలతో వీటిని ఏర్పాటు చేయడంతో చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. జాతీయ రహదారి 216 అనుకుని ఈ గ్రామం ఉంది. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు వీటిని చూసి అబ్బురపడుతున్నారు.

కేసుల రాజీలో మధ్యవర్తిత్వమే కీలకం



నరసాపురం: కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్



పాలకొల్లు సెంట్రల్: మాట్లాడుతున్న ప్రినిపల్ సివిల్ జడ్జి జియావుద్దీన్

నరసాపురం: న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా కేసుల రాజీని ప్రోత్సహించాలని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ చెప్పారు. శనివారం నరసాపురం కోర్టులో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్ కేసు పరిష్కారానికి ఇరు పార్టీలను కూర్చోబెట్టి మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేయవచ్చని చెప్పారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, చెక్‌బౌన్స్ కేసులు వంటివాటిపై దృష్టిపెట్టాలని చెప్పారు. ఇరుపక్షాల న్యాయవాదులు ఇందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, కార్యదర్శి రంపా పుల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: మధ్యవర్తిత్వం అనేది ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కార విధానంలో కీలక భాగమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ మాట్లాడుతూ కోర్టు కేసుల పరిష్కారంలోనూ మధ్యవర్తిత్వం కీలక భూమిక పోషిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో ఇది చాలా అవసరమని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కారం చేసుకోవడం వల్ల సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ సూర్యనారాయణ, న్యాయవాది వలవల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

పెనుగొండ: మన దేవాలయాలను మనమే నిర్వహించుకోవాలనే సంకల్పంతో దేవాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి కోసం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న నిర్వహించే హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ్ కార్యకారిణి సభ్యులు చింతాకుల గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం సిద్ధాంతంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ ఐక్యత శక్తిని నిరూపించే మహాఉద్యమంలో పెనుగొండ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా చేయడం కోసం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సిద్ధాంతం విజయగోపాల స్వామి దేవస్థానంలో హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశామని తెలిపారు. పేరవరానికి చెందిన గీతాశ్రమ పీఠాధిపతులు నిత్యానంద గిరి స్వామిజీ పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకే పరిమితమైన ఆత్మీయ సమావేశాలు



పెనుగొండ: సిద్ధాంతంలో అరకొరగా హాజరైన తల్లిదండ్రులతోనే ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు విద్యార్థులకే పరిమితమయ్యాయి. శనివారం పెనుగొండ,ఆచంట మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ సమావేశాలకు కూటమి నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తప్ప తల్లిదండ్రుల హాజరు శాతం తక్కువగానే ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాఠశాలల్లో ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో తల్లిదండ్రులు నిరాశక్తతకు లోనై హాజరుకాలేదంటూ పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో సమీపంలోని తల్లిదండ్రులను కూటమి నాయకులు మరీ ప్రత్యేకంగా తీసుకు రావడంతో తప్పని పరిస్థితుల్లో హాజరయ్యారు. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలోనే నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని, అంతేకాకుండా, అమ్మ ఒడి వంటి పథకాలుతో పేదలకు అండగా నిలిచారంటూ పలువురు వ్యాఖ్యానించడం విశేషం. ఇప్పటి వరకూ తల్లికి వందనం జమ చేయకపోవడంతో తల్లిదండ్రులు గుర్రుగా ఉన్నా ఎప్పుడు జమ చేస్తారు? అంటూ ఎదురు చూస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టి కృషి చేస్తూ, పలు సూచనలు చేయాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ పిలుపు నిచ్చారు. పెనుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లోశామె పాల్గొన్నారు. చెరుకువాడ, సిద్ధాంతంలోన్లూ, ఆచంట మండలంలో పలు పాఠశాలల్లోనూ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. బహుమతులు అందించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీఓ టీఎస్ఎన్ మూర్తి, ఆచంట తహసీల్దారు జి.కనకరాజు, ప్రధానోపాధ్యాయులు భరణి, ఎస్తేరు క్వీనీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో జరిగే విషయాలపై దృష్టి సారించాలి

మొగల్తూరు: విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలలో జరిగే అన్ని విషయాలపై దృష్టి సారించడమే కాకుండా ప్రతి విషయంలోనూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో తమ పిల్లలకు అందిస్తున్న విద్యా, ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా విధానం అమలవుతుందా? లేదా? తదితర విషయాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. హెచ్ఎం వి.రవిశంకర సర్కార్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, ఎంఈఓ శామ్యూల్ జాన్, ఈఓపీఆర్డీ నవీన కిరణ్ పాల్గొన్నారు.

విద్యతోనే గౌరవ మర్యాదలు

పాలకొల్లు అర్బన్: జీవితంలో బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్న వ్యక్తులకు సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు అన్నారు. మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో దాసి రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ఎంతో మంది వ్యక్తులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులతో కలిసి ఆర్డీవో రాజు భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపీడీఓ ఎస్ ఉమామహేశ్వరరావు, ప్రత్యేకాధికారి ఎ.లక్ష్మి, సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ వై.చంద్రశేఖర్, ఎంఐఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ ఆర్ఎస్‌వీఎస్ గంగాధరశర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే శివదేవునిచిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం పాఠశాల హెచ్ఎం పొట్ల రాము అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, అలాగే తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. సహోపాధ్యాయుడు మూర్తి, పీఎంసీ చైర్మన్ ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు, మగవారికి టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు.



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు



నరసాపురం రూరల్: వైఎస్‌పాలెం ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తున్న దృశ్యం



మొగల్తూరు: ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ కె.రాజకిశోర్

మొగల్తూరుపై మంచు దుప్పటి



మొగల్తూరులో కురుస్తున్న మంచు



చెట్లను కమ్మేసిన మంచు

మొగల్తూరులో శనివారం వేకువజాము నుంచి ఉదయం 10 గంటలు వరుకు భారీ మంచు కురిసింది. ఇటీవల కాలంలో ఇంత భారీగా మంచు కురవలేదు. గ్రామంలోని ప్రధాన రహదారులను, తోటలను పూర్తిగా మంచు కమ్మేసింది. ప్రధాన రహదాలను మంచు కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటలు తరువాత ఎండ రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులు, వ్యాపారులు మంచు కారణంగా ఇబ్బందులు పడ్డారు. – మొగల్తూరు

వలందర్‌రేవులో వసతులు కరువు

నరసాపురం: నిత్యం రద్దీగా ఉండే వశిష్ఠ గోదావరి వలందర్ రేవులో కనీస వసతులు లేక అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో గోదావరి వలందర్ రేవు ప్రధానమైనది. కర్మకాండలు, పూజలు నిమిత్తం దూర ప్రాంతాల నుంచి నిత్యం రేవుకు అనేక మంది వస్తుంటారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో భక్తులు రేవులో స్నానాలు చేస్తారు. కానీ రేవులో కనీస వసతులు మాత్రం లేవు. ముఖ్యంగా రేవును శుభ్రం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో రేవు నిండా బురద పేరుకుపోయి స్నానాలకు దిగిన భక్తులు కాలు జారి పడుతున్నారు. రేవులో అస్తికలు కలిపిన కుండలు వంటివి ఎప్పటికప్పుడు తీయకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఇప్పటికైనా వలందర్ రేవులో పరిస్థితిని చక్కదిద్దాలని భక్తులు కోరుతున్నారు.



బురదతో అధ్వానంగా ఉన్న వలందర్ రేవు